క్లుప్తంగా

99 శాతం పింఛన్ల పంపిణీ

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీ సోమవారం కొనసాగిందని ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు. ఈనెల 4వ తేదీ నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించగా పలువురికి గ్రామ సచివాలయంలోనూ, మంచానికి పరిమితమైన వారికి, దివ్యాంగులకు సచివాలయ సంక్షేమ అధికారులు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు 99 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఈవీఎం పనితీరుపై అవగాహన



తుగ్గలిలో ఈవీఎం, వీవీ ప్యాట్లపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ షర్మిల

తుగ్గలి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల నిర్వహణ, వాటి వినియోగంపై అవగాహన కలిగిఉంటే పోలింగ్ రోజున ఇబ్బందులు తలెత్తకుండా నివారించవచ్చని తహసీల్దార్ షర్మిల అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బూత్ లెవెల్ అధికారులకు ఈవీఎంల నిర్వహణపై అవగాహన కల్పించారు. పోలింగ్ సమయంలో ఎటువంటి సందేహాలు, సమస్యలకు తావివ్వకుండా ముందుగానే అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్లు, హ్యాండ్ బుక్, పోలింగ్ కేంద్రాలపై పూర్తి సమాచారం దగ్గర ఉంచుకోవాలన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్లను పోలింగ్ కేంద్రాల్లో అమర్చడంపై మాక్ పోలింగ్ ద్వారా అవగాహన కల్పించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న సెబ్ సీఐ భార్గవ రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని మంత్రాలయం మండలంలో భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ భార్గవ రెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. మంత్రాలయం మండలం నారాయణపురం వద్ద వాహనాల తనిఖీ చేపట్టి బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడు రాయచూర్ జిల్లా గిలకసూగుర్ తాలుకా కటకనూరు గ్రామానికి చెందిన నరసింహులును అరెస్ట్ చేసి ఎనిమిది బాక్సుల్లో 760 (90 ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ దాదాపు రూ.75 వేలు ఉంటుందని తెలిపారు. ఎవరైనా అక్రమ మద్యం విక్రయించినా, తరలిస్తున్నట్లు తెలిసినా తన సెల్ నంబర్ 94409 02579కు సమాచారం ఇవ్వాలని కోరారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ సత్యనారాయణ, ఇంటెలిజెన్స్ హెచ్‌సీ సంజీవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ప్రచారంలో నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్ఓ డి.రామునాయక్

ఆలూరు: రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రచారం చేసుకోవచ్చని, అతిక్రమిస్తే తగిన చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డి.రామునాయక్ హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ చంద్రశేఖరయ్య సమక్షంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయా పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు బుసినె విరూపాక్షి, వీరభద్రగౌడు, రామలింగ, బాషా, రెవెన్యూ, ఎంపీడీఓ, పోలీసు శాఖ అధికారులు హాజరయ్యారు. ఆర్ఓ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారానికి అభ్యర్థులు ముందుగానే అనుమతి తీసుకోవాలన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా అభ్యర్థులు ప్రచారం చేసే ప్రాంతాలు, సమయం, వాహనాల వివరాలతో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అనుమతి మంజూరుచేస్తామన్నారు. ఇద్దరు ఎమ్మెల్యే అభ్యర్థులకు ఒకే సమయంలో ఒకే గ్రామంలో ప్రచారానికి అనుమతి ఇవ్వబోమన్నారు. అలాగే అభ్యర్థుల ఖర్చుపై నిఘా ఉంటుందని చెప్పారు. ఆరు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, న్యాయవాదులు, సీఐ బి.వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎన్నికల అధికారి గుండాలనాయక్, డీటీ రజనీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

ఆలూరు రూరల్: పేకాట స్థావరంపై దాడి చేసి రూ.1,00,490 నగదు స్వాధీనం చేసుకుని 9 మందిని అరెస్టు చేసినట్లు హాలహర్వి ఎస్ఐ నరేంద్ర కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. వచ్చిన సమాచారం మేరకు.. మండలంలోని చింతకుంట శివారులోని ఇండియన్ పెట్రోల్ బంకు సమీపంలో ఆలూరు మండలంలోని ఆలూరు, హత్తిబెళగల్, ఆస్పరి మండలంలోని చిన్నహోతూరుకు, సిరిగాపురం, అనంతపురం జిల్లా విడపనకల్లు, సింతరాంపల్లి గ్రామాలకు చెందిన 9 మంది పేకాట ఆడుతుండగా దాడులు చేశామన్నారు. వారి వద్ద నుంచి నగదు, 6 స్కూటర్లు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు

పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



బోగోలులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): అధికారం చేపట్టిన మొదటిసారే అన్ని వర్గాల ప్రజలకు మంచి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మరోసారి మద్దతిచ్చి గెలిపించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కోరారు. ఆమె సోమవారం మండల పరిధిలోని బోగోలు, గువ్వలకుంట్ల గ్రామాలలో తనయుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న, ఎంపీటీసీ లావణ్యతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడుతూ, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను గుర్తుచేస్తూ సాగారు. సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందించి కరోనా సమయంలోనూ వెరువక పేదల ఆర్థికాభివృద్ధి మెరుగు పరిచిన ప్రభుత్వం తమదన్నారు. గ్రామగ్రామాన అభివృద్ధి, సౌకర్యాలు కల్పించిన ఘనత తమదని వివరించారు. నియోజకవర్గంలో తాను అధికారం చేపట్టిన నాటి నుంచి చేసిన అభివృద్ధి పనులు, సౌకర్యాలు ఫలితాలు తనకు సంతృప్తి ఇస్తున్నాయన్నారు. చెరువులకు నీరు నింపే ప్రక్రియ ద్వారా బోగోలు చెరువు నిండడం, రైతులు వరి పంట సాగుచేయడం చూస్తుంటే ఆనందాన్నిస్తోందన్నారు. నాడు-నేడు కింద పాఠశాలల అభివృద్ధి, సౌకర్యాల మెరుగు జరిగిందని వివరించారు.సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి, సౌకర్యాల కల్పన వంటి మంచి పనులు చేస్తున్న ప్రభుత్వం కొనసాగేలా ప్రజలు మే 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా బీవై రామయ్యకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. నాయకులు కంగాటి వెంకట్రామిరెడ్డి, కమలాకర్, మాధవకృష్ణ, కుల్లాయి, ఆనందరెడ్డి, సోమశేఖర్ రెడ్డి, చిన్నకేశవులు, నాగేంద్ర, లక్ష్మన్న, శ్రీనివాసరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, నగేశ్, ఈరన్న, శేఖర్, మధు, భూషన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

కృష్ణగిరి: పత్తికొండ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారికి ఉగాది పండుగతోనే సంవత్సరం ప్రారంభమవుతుందన్నారు. ఈ కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబం సంక్షేమం, సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలని, పల్లెల్లో పశు సంపద, వ్యవసాయ, ఉద్యాన పంటలతో రైతులు కళకళలాడాలని ఆమె ఆకాంక్షించారు.

గడ్డివాముల దగ్ధం

మద్దికెర: మండల పరిధిలోని మదనంతపురం గ్రామంలో సోమవారం గడ్డివాములకు నిప్పంటుకొని దగ్ధం కావడంతో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు లక్ష్మణస్వామి వాపోయారు. మంటలు చెలరేగిన వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

ఉచ్చుపై పరిశీలన

తుగ్గలి: మండల పరిధిలోని గిరిగెట్ల, తుగ్గలి పరిసర పొలాలను సోమవారం పత్తికొండ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రామచంద్రుడు పరిశీలించారు. అడవి జంతువులు రాకుండా పొలాల్లో ఏర్పాటు చేసిన కత్తెర ఉచ్చులో ఓ మహిళ కాలు ఇరుక్కుని గాయాలైనట్లు పత్రికల్లో వార్తలు రావడంతో ఆయన పొలాలను పరిశీలించారు. పొలాల్లో కత్తెర ఉచ్చులు ఏర్పాటు చేయరాదన్నారు. బీట్ ఆఫీసర్ లక్ష్మన్న వెంట ఉన్నారు.

సెలవులో సర్పంచ్

తుగ్గలి: అనారోగ్య కారణాలతో మండల పరిధిలోని రాతన గ్రామ సర్పంచ్ గూడూరు రాచప్ప కొన్ని నెలల పాటు సర్పంచ్ పదవీ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ విజయలక్ష్మిని కలిసి కొన్ని నెలల పాటు సెలవులో వెళుతున్నట్లు మెడికల్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎంపీడీఓ చెప్పారు.

మతిస్థిమితం లేని మహిళపై అత్యాచారం

ఆస్పరి: మండలంలోని నగరూరు బస్టాప్ వద్ద ఆదివారం రాత్రి మతిస్థిమితం లేని మహిళపై ఓ వ్యక్తి అత్యాచారం చేసినట్లు ఆస్పరి సీఐ హనుమంతప్ప తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని బిణిగేరి గ్రామానికి చెందిన మతి స్థిమితం లేని మహిళ ఆదివారం రాత్రి నగరూరు బస్టాప్ వద్ద ఉండగా నగరూరు గ్రామానికి చెందిన రాముడు అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడినట్లు చెప్పారు. ఈ మేరకు

అవి-ఇవి

రాముడుపై కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

ఓటరు నమోదుకు చివరి అవకాశం

గోనెగండ్ల: 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పార్వతి సూచించారు. ఆమె సోమవారం మాట్లాడుతూ.. అర్హత ఉండి ఇప్పటివరకు ఓటరుగా నమోదు చేసుకోని వారికి ఎన్నికల కమిషన్ చివరి అవకాశం కల్పిందన్నారు. ఈనెల 15 తేదీ లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. మండలంలో ఇప్పటివరకు 29,061 మంది పురుషులు, 28,859 మంది మహిళలు, ఇతరులు ఇద్దరితో కలుపుకుని మొత్తం 57,922 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అలాగే 85 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి దగ్గరే ఓటు వేసేలా ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని ఇందుకోసం బీఎల్ఓలు, సెక్టోరియల్ ఆఫీసర్లు వారిని గుర్తించి ఫారం 12డీలో వివరాలను నమోదు చేస్తున్నట్లు చెప్పారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

నందవరం: అక్రమంగా తెలంగాణ మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. నందవరం మండల పరిధిలోని నాగలదిన్నె పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. నందవరం మండలం పొనకలదిన్నె గ్రామానికి చెందిన గొల్ల అవుకు కొండన్న తెలంగాణలోని అయిజ పట్టణంలోని వైన్ షాపులో మద్యాన్ని కొనుగోలు చేసి తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. తెలంగాణ మద్యం 60 ఆరమోస్ ఒకే వసోప్ బ్రాందీ 90 పిట్ బ్యాటిళ్లు స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వెల్లడించారు. తనిఖీలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమం వాయిదా

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల విధుల్లో పాల్గొనే పీఓ, ఏపీఓ, ఓపీఓలకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కరెకృష్ణ, దావీదు, ఎల్లప్ప, తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి చిరంజీవికి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. బుధవారం పాఠశాలల్లో ఎస్ఏ-2 ఇంగ్లిష్ పరీక్ష ఉందని, అదే సమయానికి ఎన్నికల శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తుండడం వల్ల ఇబ్బందికరంగా మారిందన్నారు. ఉదయం నిర్వహించే శిక్షణా కార్యక్రమాన్ని వాయి దా వేయాలని కోరగా ఆర్ఓ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాలతో 12వ తేదీ మధ్యాహ్నం శిక్షణ కార్యక్రమం నిర్వహించేలా నిర్ణయించారు. షెడ్యూల్ ప్రకారం బుధవారం మధ్యాహ్నం నిర్వహించే శిక్షణా కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఫ్యాప్టో నాయకులు తెలిపారు.

అభివృద్ధిపై దృష్టి సారించండి

మద్దికెర: మండలంలోని గ్రామాల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీఓ అలివేలమ్మ సూచించారు. ఆమె సోమవారం స్థానిక కార్యాలయంలో మండలంలోని ఆయా శాఖల అధికారులతో ఆస్పిరేషనల్ బ్లాక్ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారులు తమ శాఖల్లో జరిగిన అభివృద్ధి, పనితీరును గమనించి వివరాలు నమోదు చేయాలన్నారు. నీతిఆయోగ్ పథకం కింద అత్యంత వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ఎంపికైన మండలాల్లో అన్ని రంగాలలో పనితీరు మెరుగుపరచాలన్నారు. అందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని చెప్పారు. మౌలిక సదుపాయాలను కల్పించడం, వెనకబడిన, అట్టడుగు వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఎంఈఓ రంగస్వామి, ఏఈ ఉమాకాంత్, ఏపీఓ నర్సిరెడ్డి, ఏపీఎం మధుబాబు పాల్గొన్నారు.

చంద్రబాబువి గారడీలు.. జగనన్నవి గ్యారెంటీలు



ఎమ్మిగనూరు 16వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఓర్వలేక కుట్రలు పన్నుతూ, అలవిగాని హామీలతో మరోసారి మభ్యపెట్టేందుకు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రయత్నిస్తోందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక ఆరోపించారు. ఆమె సోమవారం పట్టణంలోని 16వ వార్డులో కౌన్సిలర్ వాహిద్, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధి సీఎం వైఎస్ జగనన్నతోనే సాధ్యమని, దీన్ని ఐదేళ్లలోనే చేసి చూపించారన్నారు. మరోసారి అవకాశం ఇచ్చి జగనన్నను సీఎంగా గెలిపించుకుంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందడంతో పాటు పేదల కష్టాలన్నీ తీరతాయన్నారు. టీడీపీ నాయకుల మాయమాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. 2014లో ఇదే కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతోనే ప్రజాగ్రహానికి గురై అధికారం కోల్పోయారని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగనన్న ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి మాట నిలబెట్టుకున్నారన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థిగా బీవై రామయ్య, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్న తనకు మద్దతు తెలుపుతూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తూ ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠ, బీసీ సంఘం జాతీయ నాయకుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, పార్టీ పట్టణాధ్యక్షుడు బుట్టా రంగయ్య, రియాజ్‌అహమ్మద్, యూకే రాజశేఖర్, సునీల్‌కుమార్, రామాంజినిరెడ్డి, బజారిరెడ్డి, రాజరత్నం, సుధాకర్, కేశవరెడ్డి, ఖాశింబేగ్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న బుట్టా రేణుక

దైవమార్గంలో నడిపించేది ఉపవాస దీక్ష

ఎమ్మిగనూరుటౌన్: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు పాటించే కఠోర ఉపవాస దీక్షలు దైవ మార్గంలో నడిపించేందుకు దోహదపడతాయని బుట్టా రేణుక పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం 11వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆమె పాల్గొన్నారు. స్వయంగా భోజనం వడ్డించడంతో పాటు మహిళలతో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించారు. అంతకుముందు ముస్లింలు దువా చేశారు. ముస్లిం పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి

వైఎస్సార్‌సీపీలో చేరిక

చిప్పగిరి: నియోజకవర్గంలోని గూళ్యం, కోగిలతోట గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన 70 కుటుంబాల వారు సోమవారం ఆ పార్టీలను వీడి ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. చిప్పగిరిలోని విరూపాక్షి స్వగృహంలో వారు వైఎస్సార్‌సీపీలో చేరగా ఆయన పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. విరూపాక్షి మాట్లాడుతూ.. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు లింగప్ప, సోమప్ప, మంజు, మల్లప్ప, వెంకటేష్, రమేష్, మార్లింగ, తదితరులు ఉన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన



మిట్టసోమాపురంలో ప్రచారం చేస్తున్న బుట్టా ప్రతుల్

నందవరం: సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బుట్టా ప్రతుల్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సోమవారం మండలంలోని మిట్టసోమాపురం గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి గ్రామస్తులను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా బుట్టా ప్రతుల్ మాట్లాడుతూ.. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. పేద కుటుంబాల జీవన ప్రమాణాలు పెంచి బతుకులకు భరోసానిచ్చారని గుర్తు చేశారు. అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పింఛన్ కానుక, రైతు పెట్టుబడి నిధి, వైఎస్సార్ బీమా, ఆరోగ్య శ్రీ తదితర పథకాలు చరిత్రలో నిలిచిపోయేలా ఉన్నాయన్నారు. పేదల సంక్షేమం కోసం జగనన్న చేస్తున్న కృషి అమోఘమన్నారు. అధికార దాహంతో టీడీపీ నాయకులు చెప్పే మోసపూరిత మాటలు నమ్మకండని ప్రజలను కోరారు. ప్రచారంలో పార్టీ మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి, సర్పంచు లక్ష్మిదేవి, లింగన్న, బొజ్జప్ప, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



కస్తూర్బా విద్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: బాల్య వివాహాల వల్ల భవిష్యత్తులో అనేక సమస్యలు వస్తాయని, వాటిని అరికట్టేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ లూక్ పిలుపునిచ్చారు. స్థానిక కస్తూర్బా విద్యాలయంలో సోమవారం ఆయన ఉపాధ్యాయ బృందంతో కలిసి విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం, కులాచారాల పట్టింపులు, నిరక్షరాస్యత తదితర సమస్యల వల్ల చిన్న పిల్లలకు పెళ్లిళ్లు చేయడం జరుగుతుందన్నారు. చదువుకున్న వారు దీన్ని అరికట్టాలన్నారు. చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం వల్ల మానసికంగా, శారీరకంగా ఎదుగుదల లేకపోవడం, పిల్లల్లో అంగవైకల్యం, రక్తహీనత తదితర సమస్యలు వస్తాయన్నారు. సమాజ పురోభివృద్ధికి బాల్య వివాహాలు అడ్డంగా మారుతున్నాయన్నారు. బాలబాలికలకు యుక్త వయస్సు రాక ముందే వివాహం చేసే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని తెలియజేశారు. సూపర్‌వైజర్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భార్యపై భర్త దాడి

కృష్ణగిరి: వివాహేతర సంబంధం పెట్టుకున్న భర్తను నిలదీయగా భార్యపై దాడికి పాల్పడ్డాడు. ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని ఎరుకలచెర్వు గ్రామానికి చెందిన వెంకటేష్, రేణుకమ్మ దంపతులకు నలుగురు పిల్లలు. ఇతను ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాదికాలంగా వెంకటేష్ కంబాలపాడు గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్య, పిల్లలను వదలి వేరే గ్రామంలో ఉంటున్నాడు. ఆదివారం మహిళతో కలిసి ఆటోలో కూలీలను తీసుకుని వస్తూ ఎరుకలచెర్వు గ్రామంలో కనిపించడంతో భార్య నిలదీసింది. ఇద్దరూ కలిసి ఆమెపై దాడిచేశారు. ఆటోతో ఢీకొట్టి పారిపోయారు. దీంతో ఆమెకు గాయాలయ్యాయి. బాధితురాలు రేణుకమ్మ ఫిర్యాదు మేరకు భర్త వెంకటేష్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

జేసీబీ ధ్వంసంపై కేసు నమోదు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరు రోడ్డులో టమాట ప్రాసెసింగ్ యూనిట్ పనులు చేస్తున్న జేసీబీని ధ్వంసం చేసిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. ఇటీవల పత్తికొండలో రైతు భరోసా సభకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి టమాట జ్యూస్ ఫ్యాక్టరీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనను ఆదేశించడంతో సర్వే నంబర్ 286/1ఏ4లో ఫ్యాక్టరీ పనులను ప్రారంభించారు. పక్కనే చుక్కల భూమి కలిగిన రైతు రామాంజనేయులు తనకు నష్టం కలుగుతుందని కోర్టును ఆశ్రయించాడు. ఇదిలాఉండగా స్థానిక ప్రజల చిరకాల వాంఛ నెరవేర్చేలా ఫ్యాక్టరీని స్థాపిస్తే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందనే ఉద్దేశంతో కొందరు పనులను అడ్డుకుంటున్నారు. పొలంపై ఎలాంటి హక్కులేని మధుసూదన్, రంగస్వామి, పగిడాల అంజనేయులు, చిన్న రంగమ్మ, జయలక్ష్మి, సంజీవ, చిన్న రంగన్న, పెద్ద గంపన్న అనే వ్యక్తులు అక్కడికి వచ్చి కాంట్రాక్టర్‌ను బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోవడంతో జేసీబీని ధ్వంసం చేశారు. ఘటనపై కాంట్రాక్టర్ దాసరి ఫణీంద్ర రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



ఆస్పరిలో రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు



ఎంపీడీఓ విజయలక్ష్మికి రాజీనామా పత్రాలను అందజేస్తున్న తుగ్గలి వలంటీర్లు

ఆస్పరి: ప్రతిపక్షనాయకుడు చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన ఆరోపణలకు మనస్తాపం చెందిన ఆస్పరి మండలంలోని ఆస్పరి, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, బిణిగేరి, బిల్లేకల్లు, జొహరాపురం, ముత్తుకూరు, ములుగుందం గ్రామాల నుంచి వచ్చిన 200 మంది వలంటీర్లు సోమవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. మండలంలో 304 మంది వలంటీర్లు ఉండగా ప్రస్తుతం 200 మంది రాజీనామా చేశారు. మిగతా వారు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ లక్ష్మీనారాయణకు అందజేయడానికి వలంటీర్లు వెళ్లగా సచివాలయ కార్యదర్శులతో క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకొచ్చిన తరువాత ఆ నివేదికను జిల్లా అధికారులకు పంపి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తుగ్గలిలో వలంటీర్ల రాజీనామా

తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలిలో 24 మందికి గాను 18 మంది, గిరిగెట్లలో 10 మందికి గాను ఐదుగురు వలంటీర్లు సోమవారం తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ విజయలక్ష్మికి సమర్పించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నాలుగున్నరేళ్లుగా సంక్షేమ పథకాలను సకాలంలో లబ్ధిదారులకు అందిస్తూ సేవలందించామని, సేవా దృక్పథంతో విధులు నిర్వహిస్తున్న తమపై ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అభద్రతాభావంతో వలంటీర్లపై టీడీపీ నిందలు మోపుతున్నారని వాపోయారు. దీంతో మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆలూరు రూరల్: ఆలూరు మండలంలోని కమ్మరచేడు సచివాలయం పరిధిలో 11 మంది, మొలగవల్లి సచివాలయం-2 పరిధిలో ముగ్గురు, మూసానహళ్లి సచివాలయం పరిధిలోని కాత్రికి గ్రామానికి చెందిన ఒక వలంటీర్ సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను ఎంపీడీఓ నరేంద్రకుమార్‌కు అందజేశారు. ప్రజలకు సేవ చేస్తున్న తమపై టీడీపీ, జనసేన నాయకుల తప్పుడు ఆరోపణలకు మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి, రామకృష్ణాపురం గ్రామాలకు చెందిన ముగ్గురు వలంటీర్లు విధులకు రాజీనామా చేశారు. సోమవారం ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్‌కు రాజీనామా పత్రాలను అందజేశారు.

అవ్వాతాతల ఉసురు తగులుతుంది



టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వలంటీర్లపై కక్ష గట్టి ప్రజాసేవ చేసేందుకు దూరం చేశారు. ఈ నెలలో అవ్వాతాతలు, దివ్యాంగులు పింఛన్ తీసుకునేందుకు పడిన బాధలు చూడలేకపోయాం. వారి ఉసురు చంద్రబాబు, పవన్‌కు తగులుతుంది. ఇవే వారికి చివరి ఎన్నికలు.

– గఫూర్, వలంటీర్, ఆస్పరి

సేవ చేసే భాగ్యం కల్పించారు



వలంటీర్‌గా ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రతి నెలా ఇంటింటికీ వెళ్లి అవ్వాతాతలకు పింఛన్ డబ్బులు ఇస్తుంటే వారి కళ్లలో ఆనందం చూశాం. పేద ప్రజలకు సేవ చేసే వలంటీర్లపై దుష్ప్రచారం చేసిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారు.

– అఖిల, వలంటీర్ ఆస్పరి

వలంటీర్ వ్యవస్థపై కుట్రలు



వలంటీర్ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి టీడీపీ, జనసేన నాయకులు ఏదో రూపంలో వారిపై విషం కక్కుతున్నారు. ఎన్నికల కోడ్‌ను అడ్డం పెట్టుకుని వలంటీర్ల సేవలను అడ్డుకోవడంతో ఈ నెలలో అవ్వాతాతలు పడిన బాధలు వర్ణనాతీతం. పేదలను ఇబ్బంది పెడితే వారికి ఏమొస్తుందో వారే ఆలోచించుకోవాలి.

– ఈరన్న, వలంటీర్, బిల్లేకల్లు

ఐరన్‌ఓర్ సీజ్

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలో అక్రమంగా తవ్వి నిల్వచేసిన ఐరన్ ఓర్‌ను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్ తెలిపారు. సర్పరాజాపురం, కలుగొట్ల, బాలాపురం, బేతంచెర్ల మండల పరిధిలోని పలు గ్రామాలలో అక్రమ మైనింగ్ చేపడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సోమవారం తనిఖీలు చేపట్టామన్నారు. ఆయా గ్రామాల పరిధిలో అక్రమ తవ్వకాలు గుర్తించామని, సర్పరాజాపురం రెవెన్యూ పరిధిలో తవ్వితీసి నిల్వచేసిన రెండు టిప్పర్ల ఐరన్‌ఓర్‌ను గుర్తించి సీజ్ చేశామన్నారు. అక్రమార్కులను గుర్తించేందుకు విచారణ చేస్తున్నట్లు చెప్పారు.